కూతురికి పెళ్ళి చెయ్యకుండా, ఉద్యోగం చేయిస్తూ, కొడుకోసం పెళ్ళి వాయిదా వేస్తూ ఆ డబ్బు ఖర్చుపెట్టిన తల్లి దండ్రుల్ని మనసులో క్షమించలేక పోయినా ఇన్నాళ్ళగా బయట పెట్టలేకపోయినా కసి అంతా వెళ్ళగక్కింది.

"హుం.... మీ లాంటి చదువుకున్న వాళ్ళే కొడుకు అనుకుంటూ మగపిల్ల వాడి కోసం కొట్టుకుపోతూ, ఆడపిల్లలు పుడితే ఏడుస్తూ, వాళ్ళని నిర్లక్ష్యం చేసి కొడుకులని నెత్తికెక్కించుకునే మీ లాంటి తల్లి తండ్రులకి నాలాంటి ఆడపిల్లల ఉసురు శాపంగా మారుతుందమ్మా- చచ్చాక మిమ్మల్ని భవసాగరం దాటించి స్వర్గ ద్వారాలు తెరుస్తారో లేదో ఎవరికీ తెలియదు కాని, బతికుండగా మీకు నరకం చూపించిన కొడుకులే మీకు తగిన వాళ్లు!.... ఈ శాస్తి మీకు సరి అయిందే...." హేళనగా అని విసురుగా వెళ్ళిపోయింది కూతురు.

కూతురన్న ఏ మాటకీ తప్పు పట్టలేని ఆ తల్లి తన దగ్గిర ఆ మాటలకి జవాబు లేదన్నట్టు తలదించుకుంది.

(వనిత) ★

# జననీ జన్మభూమీ....

ఆ ఇంట్లో అరగంట నించీ కూతురి పెళ్ళి విషయమై పెద్ద గొడవ జరుగుతూంది. అంత గొడవకీ కారణమైన వాసంతి తను చెప్పదలచింది కుండ బద్దలు కొట్టినట్టు మరోసారి చెప్పేసి తన పని అయిపోయినట్టు లోపలి కెళ్ళిపోయింది. శంకర్రావు, కమల మొహాలు చూసుకున్నారు. కూతురు నిర్లక్ష్యధోరణికి వాళ్ళ మొహాలు మరింత ఎర్రబడ్డాయి. "దాన్ని ముద్దు చేసి నెత్తి నెక్కించుకున్నారు. అది ఇలా మాట్లాడుతుందంటే మీ రిచ్చిన అలుసే కారణం." కమలమ్మ తప్పంతా భర్తదే అన్నట్లంది.

"నోర్ముయ్! ముద్దుచేస్తే పొగరుగా జవాబివ్వమనా అర్థం? ఆడపిల్లకి అణకువ నేర్పడం తల్లి వంతు.... మొక్కను వంచకుండా వదిలేయడం నీ తప్పు." శంకర్రావు భార్యని నిందించాడు.

ఒకరిమీద ఒకరు నింద మోపుకుంటూ ఇద్దరూ కాసేపు అరుచుకున్నారు.

"దాని కర్మ ఎలా వుంటే అలా జరుగుతుంది. ఇంత మంచి సంబంధం వదులుకుంటే మళ్ళీ దొరుకుతుందని ఏముంది? ఇది వదులుకుంటే తరువాత దాని రాత ఎలా ఉంటే అలా జరుగుతుంది" శంకర్రావు విరక్తిగా అన్నాడు.

"దాన్ని కన్నాం గాని దాని రాతిని కనలేదు. నయానా, భయానా చెప్పి చూశాం, వినకపోతే అనుభవిస్తుంది." కమల అంది. భార్యాభర్తలు ఈ విషయంలో మాత్రం ఏకాభిప్రాయానికి వచ్చి, కాసేపు కూతురు ధోరణికి విచారించి ఏం చెయ్యాలో తోచక తల పట్టుకున్నారు.

"అయినా దీనికి ఇంత ఫారెన్ మోజు ఏమిటి? మన దేశంలో ఉన్నవాళ్ళు మనుషులు కానట్టు మాట్లాడుతుంది. ఎమ్ టెక్ చదివాడు, రెండువేల ఐదొందల జీతం, ఇంకా ముందు ముందు వృద్ధిలోకి వస్తాడు - స్మార్ట్‌గా ఉన్నాడు - ఒక్కడే కొడుకు. ఇన్ని ఉన్నా ఇండియాలో ఉన్నాడు కాబట్టి వద్దంటుంది. దీనికేమన్నా పిచ్చి పట్టిందా?" శంకర్రావు ఆవేదన—

"ఫారెన్‌లో ఉంటే చదువు సంధ్య లేనివాడైనా, రోడ్డు తుడిచేవాడినైనా చేసుకునేట్టుంది దీని ధోరణిచూస్తే. అన్నీ కలిసివస్తే పోనీ అనుకోవచ్చు. కేవలం ఫారెన్ కాదని వదులుకోడం ఎంత తెలివి తక్కువతనం. అసలు దీనికి ఇంత ఫారెన్ మోజుందని ఇన్నాళ్ళూ నీకు తెలిసేలేదా?" శంకర్రావు మళ్ళీ భార్యమీద నింద మోపాడు.

"బాగుంది. ఏదో చిన్నతనం, పిచ్చి మాటలు అనుకున్నానుగాని ఇంత తెలివితక్కువ తనంగా రాజాలాంటి సంబంధాన్ని వదులుకుంటుందని ఎలా అనుకుంటాను? ఏదో ఫారెన్ డ్రస్సులు, సెంట్లు, వస్తువులు అంటే మోజు అనుకున్నానుగాని ఫారెన్ మొగుడిమీద కూడా ఇంత మోజని అదెప్పుడన్నా స్పష్టంగా చెప్పిందా అసలు?" కమల గయ్యమంది.

"బాగుంది ఇప్పుడిక ముందు గ్రీన్‌కార్డు ఉందా లేదా అని చూసి చదువూ సంధ్యా వగైరాలు చూడాలన్నమాట! అయినా దేశంకాని దేశం వెళ్ళి, అయిన వాళ్ళందరికి దూరం అయి అవస్థలు పడడం ఎందుకు. అక్కడ డబ్బుంటే వస్తుంది గాని చచ్చినట్లు అన్ని పనులు చేసుకోవాలి. దీనికసలు ఏమీ చాతకాదు పని. అక్కడెళ్ళి ఏం అవస్థ పడగలదు? అక్కడన్నీ సుఖాలు, అక్కడన్నీ కష్టాలు అనుకోడం ఎందుకు. ఏ దేశంలో ఉండే ప్రాబ్లమ్స్ ఆ దేశంలో ఉన్నాయి. మన కున్నది ఒకత్తి. దాన్నంత దూరం పంపి చూడాలన్నా ఏ రెండు మూడేళ్ళకోగాని చూడలేం, దాని కీ పిచ్చేమిటి? మరోసారి నచ్చచెప్పి చూడు—" ఉన్న ఒక్క కూతురినీ విదేశం పంపడం ఇష్టంలేని తండ్రి హృదయం అతనిది.

"ఈ సంబంధం అనుకున్న దగ్గరనించీ. నచ్చచెపుతూనే ఉన్నాను. అదనలు పెళ్ళి చూపులకే ఒప్పుకోకపోతే "పిలిచాం, పరువు పోతుం"దని బతిమిలాడి ఒప్పించాను, అబ్బాయినిచూసి ఒప్పుకుంటుందేమోనని ఆశపడ్డాను— మంచీ చెడూ దానికి అనవసరమట, ఫారెన్‌లో ఉండాలని దాని కోరికట—ఆ కోరిక తీరాలంటే గ్రీన్‌కార్డ్ హోల్డర్‌ని కాని చేసుకోను అని తెగేసి చెప్పాక ఇంకేం చెప్పమంటారు. కానీండి ఏం చేస్తాం? మెడలు వంచి చేయలేంగదా! మన వాళ్ళ బోలెడుమంది అమెరికాలో ఉన్నారు. సంబంధం కావాలంటే దొరక్కపోదు—ఎటొచ్చీ విదేశం పంపాలని బెంగ అంతే" అంది కమల.

ఓ అరగంట ఇద్దరూ తర్జన, భర్జనలు పడ్డాక సమాధానపడక తప్పలేదు.

* * *

కొత్త జ్ఞానం వచ్చిన దగ్గరనించీ వానంతికి విదేశాలంటే అదోరకం క్రేజ్ ఏర్పడింది. చిన్నప్పుడంటే వాళ్ళ మామయ్య, అత్తయ్య అమెరికానించి వచ్చినప్పుడల్లా తెచ్చే రకరకాల ఫ్రాకులు, బొమ్మలు, కిచెన్ సామాగ్రి, పెర్‌ఫ్యూమ్స్, ఎలక్ట్రిక్ వస్తువులూ అవీ చూస్తుంటే "అబ్బ ఎంత బాగున్నాయి" అనిపించేవి— "ఛా ఇండియాలో డబ్బు పెట్టినా ఇంత మంచి వస్తువులు దొరకవు" అని పెద్దవాళ్ళ అనుకోడం, వాళ్ళు వచ్చినప్పుడల్లా అక్కడ ఫొటోలు, స్లైడ్స్ తెచ్చి చూపించేవారు. ఆ రోడ్లు, బారులుతీరి వెళ్ళే కార్లు, ఆకాశాన్నంటే మేడలు, తెల్లగా మెరిసిపోయే మనుషులు' ఆఖరికి రోడ్లు తుడిచేవారు సైతం కోట్లు, బూట్లు వేసుకోడం, బాత్‌రూమ్‌లు కడగడానికి కూడా కార్లలో వస్తారని చెప్పుకోడం. అక్కడ తాజాగా ఎంత నవనవలాడుతూ కూరలు, పళ్ళు ఎలా ఉంటాయో, ప్రతి వస్తువూ శుభ్రంగా నీట్‌గా ప్యాక్‌చేసి ప్యాకెట్లలో ఎలా అమ్ముతారో, నోట్లో వేసుకుంటే బ్రెడ్లు, బిస్కట్లు ఎంత బాగుంటాయో అన్నీ చెపుతూంటే ఆసక్తిగా వినేది. అక్కడి చాక్‌లెట్లు ఎంత బాగుంటాయో అనుకునేది తింటూ. వాళ్ళు తెచ్చిన ఆరెంజిజ్యూస్ పౌడరు చన్నీళ్ళలో కలుపుకు తాగితే ఫ్రెష్ ఆరంజ్ జ్యూస్‌కన్నా ఎంత రుచిగా వుండేది—మనదేశంలో ఇలాంటివి దొరకవు. ఛీ అనుకునేది. వాళ్ళు తెచ్చిన పాంటీస్, గౌనులు, బ్రాలు....అన్నీ మెత్తగా ఎంత బాగున్నాయో అని మురిసిపోయేది. ఫారెన్ వెళ్ళాక మామయ్య, అత్తయ్య మంచి రంగువచ్చి మిసమిసలాడడం, వాళ్ళ కట్టు, బొట్టు, మాట మంతీలో వచ్చిన మార్పుచూసి వాళ్ళపట్ల ఆరాధన పెంచుకుంది—పుస్తకంలో ఫారెన్ బొమ్మలని ఆసక్తిగా చూసేది. ఇంగ్లీషు పిక్చర్లు, ఇంగ్లీషు మ్యూజిక్ అంటే వయసుతోపాటు క్రేజ్ పెరిగింది— విదేశం అంటే ఏదో స్వర్గంఅని, అక్కడుండేది మనుషులు కారు దేవతలని అని

పించేది—వాసంతితోపాటు ఆ ఫారెన్ మోజూ పెరగసాగింది—వాసంతి బెస్ట్ ఫ్రెండు మృదుల అన్నయ్య ఇంజనీరింగు చదివాక అమెరికాపెళ్ళి ఎమ్. ఎస్. చేసి అక్కడే ఉద్యోగంచేస్తూ గ్రీన్‌కార్డు సంపాదించుకున్నాక సెలవులకు ఇంటికి వచ్చాడు. అతను చెల్లెలికి, తల్లి దండ్రులకి, ఇంటికి రకరకాల సామాన్లు తెచ్చాడు. వీడియో తెచ్చాడు. వాసంతికి మంచి పెర్‌ఫ్యూమ్, చక్కని అరు హాంకీలు ఇచ్చాడు. ఆ దేశం కబుర్లు, ఆ దేశం ఫోటోలు, అక్కడ తన గర్ల్‌ఫ్రెండ్స్, వాళ్ళ యూనివర్సిటీ లైఫ్ అన్నీ ఊరించినట్లు చెపుతుంటే వాసంతికి అమెరికాపట్ల మరింత ఆసక్తి పెరిగింది. అసలే మాటకారి అయిన హరీష్‌రెడ్డి వాసంతిని మాటలతో రూపంతో అన్నింటికంటే గ్రీన్‌కార్డ్‌తో మరింత ఆకట్టుకున్నాడు. మనిషి పొడగరి, మిసమిసలాడే ఆరోగ్యంతో, బ్లూ జీన్స్‌లో, లైట్ బ్లూ షర్టు టక్ చేసుకుని ఎంతో స్మార్ట్‌గా కనిపించాడు. ఛా....వాళ్ళదీ, తమదీ కులాలు వేరయిపోయాయి గాని లేకపోతే....అనుకుంది మనసులో వాసంతి. చచ్చినా తనవాళ్ల ఒప్పుకోరు. వాళ్లా ఒప్పుకోరేమో. ఏమైనా హరీష్‌ని చూశాక తను తప్పకుండా అమెరికాలో సెటిల్ అయిన వాడినే చేసుకోవాలనే నిర్ణయానికివచ్చింది వాసంతి—ఈ దర్టీ ఇండియాలో ఏముంది దుమ్ము, ధూళి, ఆకలి, దరిద్రం, కుళ్ల కాలువలు, గతుకుల రోడ్లు, ముష్టివాళ్లు, రోగాలు, రొచ్చులు, జనాభాలో మూడొంతుల జనం దీదరికంలో బతుకుతున్న ఈ బీదదేశంలో ఏముంది! ఎక్కడ చూసినా మోసాలు, కుట్రలు, నీతి నిజాయితీ లేని మనుషులు....ఒక్క సదుపాయంలేని ఈ దేశంలో ఉండటం దౌర్భాగ్యం....ఉంటే అమెరికాలాంటి దేశంలో ఉండాలి. తను చచ్చినా ఇక్కడుండదు! తన మనసులో మాట ఎలా చెప్పడం?....సిగ్గు విడిచి తాను అమెరికాలో ఉండే వాడినే చేసుకుంటానని తల్లీ తండ్రితో ఎలా చెప్పడం?....ఇప్పటినించి చెపితే నవ్వుతారేమో, చూద్దాం పెళ్ళి మాట వచ్చినపుడే చెప్పవచ్చు అనుకుంది మనసులో. అయినా వీలున్నప్పుడల్లా, మాటల్లో అమెరికా లైఫ్ గురించి పొగుడుతూ ఏదో ఒకటి అంటూ తన అభిప్రాయం తెలియచెప్పాలని తాపత్రయపడేది. "తన మాటలని బట్టి తన మనసు గ్రహించటంలేదు, ఫూల్స్" అని కోపగించుకునేది మనసులో. "కానీ, సమయం వచ్చినపుడే చెపుతాను. నాకేం భయం" అని గట్టిగా నిర్ణయించుకుంది.

వాసంతి ఎమ్మే మొదటి సంవత్సరంలో ఉండగా సంబంధాలు చూడాలని ఎమ్మే అయ్యాక ఏదో ఒకటి కుదిరితే చే సేయాలని తల్లీతండ్రి నిర్ణయించుకుని సంబంధాల వేట మొదలు పెట్టారు. చాలా సంబంధాలు చూసి ఆఖరికి ఎమ్‌టెక్. అబ్బాయి సంబంధం చాలా బాగుందని పెళ్ళి చూపులకి ఏర్పాటు చేశారు—అపుడు వాసంతి ఇల్లు పీకి పందిరేసినంత గలభా చేసి, తన మనసులోని మాట చెప్పేసిందితే....

"అయ్యో పిలిచాం, ఇప్పుడు కూర్చోనంటే మా పరువేం కావాలి అని బ్రతిమిలాడితే ఎలాగో ఒప్పుకుంది—అబ్బాయి చూసి వెళ్ళాక తల్లి తండ్రి నచ్చచెపితే ఇదికాదు ఇంతకంటే రాజాలాంటి సంబంధం తెచ్చినా ఇండియా అయితే ఒప్పుకోను" అని తెగేసి చెప్పేసింది.

ఇప్పుడింక శంకర్రావు గారు గ్రీన్‌కార్డ్ హోల్డర్ల లిస్టుకి అమెరికా బంధువులందరికీ ఉత్తరాలు రాయక తప్పలేదు.

ఆ రోజు తరువాత సరిగ్గా ఏడాదికి కెన్నెడి ఎయిర్ పోర్టులో ఎయిర్ ఇండియా ఫ్లైట్ నించి దిగి న్యూయార్క్‌లో అడుగుపెట్టింది వాసంతి. ఏదో పుస్తకాలలో చదవడం సినిమాలలో, న్యూస్‌రీల్స్‌లో చూడడం కాక ప్రత్యక్షంగా అమెరికాని, తన చిన్ననాటి కలలు నిజంచేస్తూ తను న్యూయార్క్ సిటీలో అడుగుపెట్టడం అంటే ఆమెకు నమ్మశక్యం కానట్టుంది. ఇంకా—ఇంకా నిన్న మొన్నలాగే ఉంది అంతా. తను మిసెస్ శ్రీరామ్ అనడం అమెరికాలో అడుగుపెట్టడం కలకంటున్నట్టే ఉంది. వాసంతి అదృష్టవంతురాలు, అనుకున్నది సాధించింది అన్నారంతా. శ్రీరామ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగు చదివి, అమెరికా వెళ్ళి ఎమ్ఎస్. చేసి అక్కడే ఓ మంచి కంపెనీలో రెండువేల డాలర్ల జీతంతో రెండేళ్ళుగా ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి మొన్ననే గ్రీన్ కార్డు వచ్చింది. అతను నెల సెలవు మీద ఇండియా వచ్చి మంచి సంబంధం కుదిరితే పెళ్ళిచేసుకుని వెళ్ళాలనుకుంటున్నాడు. మన వాసంతికి ఈడూ జోడూ బాగుంది, ఫోటో చూసి వచ్చాడు. ఫలానా రోజు ఇండియా వస్తున్నాడు. వాసంతిని చూడటానికి ఫలానా రోజు వస్తాడు అని వాసంతి మామయ్య అంతా ఫిక్స్ చేసి రాయడం, ఆ మరునటివారంలో శ్రీరామ్ ఇండియా వచ్చి వాసంతిని చూసి ఒప్పుకోవడం మరో పదిహేనురోజుల్లోనే హడావిడిగా పెళ్ళి-మరో వారం రోజుల్లో అతను ప్రయాణమై వెళ్ళిపోవడం, పెళ్ళి, నాలుగు రోజుల కాపురం-ఆ నాలుగు రోజులలోనే నాలుగు యుగాల అనుబంధం. అన్నంతగా యిద్దరూ కలిసిపోవడం, విడువలేక విడువలేక కన్నీళ్ళతో ఒకరికొకరు వీడ్కోలు ఇచ్చుకోడం, అంత హడావిడిగా ఉక్కిరిబిక్కిరై ఊపిరి సలపనంత త్వరగా అయిపోయింది. ఆ తరువాత నాలుగు నెలల్లో వాసంతి ఎమ్మే ఫైనల్ పరీక్ష రాయడం, వీసా రావడం, అమెరికా ప్రయాణం అంతా జరిగిపోయింది. శ్రీరామ్‌లాంటి విద్యాధికుడు, అందగాడు, అన్నింటికంటె సరసుడు, సహృదయుడు భర్తగా దొరకడం ఒక ఎత్తు- తన ఫారెన్‌లో సెటిల్ అవ్వాలన్న కోరిక తీరడం ఒక ఎత్తు అయి వాసంతికి భూమిమీద నిలవనంత ఆనందంగా, గర్వంగా ఉంది.

కెన్నెడి ఏర్‌పోర్టులో ప్లేను ఆగాక గ్యాంగ్‌వే మీద నుంచే దిగ్భ్రాంతితో చూస్తూ నిలబడిపోయింది ఓ క్షణం. అంత పెద్ద ఎయిర్‌పోర్టు-ఖాళీలేకుండా నిమిషానికో విమానం వచ్చివాలుతూ, వెడుతుంటాయి. రకరకాల దేశాల విమానాలు, రకరకాల దేశాల, జాతుల పేసెంజర్లు-కిక్కిరిసినట్టయింది. ప్లేను ఆగాక గ్యాంగ్‌వే మీదనించే కారిడార్ లాంటి ద్వారం ద్వారా తిన్నగా ఎక్జిట్‌లోకి మనుషులు వెళ్ళిపోవచ్చు. లగేజి కన్వేయర్ బెల్టు ద్వారా తిన్నగా విమానంలోంచి లగేజి కౌంటర్ దగ్గరికి వెళ్ళిపోవడం చూస్తూ గాభరాగా నిలబడిపోయింది. శ్రీరామ్‌కి కేబుల్ ఇచ్చారు. ఫోనులో రిసీవ్ చేసుకుంటానని జవాబిచ్చినా శ్రీరామ్ వచ్చాడో లేదో అనుకుంది బితుకు బితుకు మంటూ. గ్లాస్‌డోర్ దగ్గర శ్రీరామ్‌ని చూశాక గుండె దడ కాస్త తగ్గింది. శ్రీరామ్ నవ్వుతూ ఎదురొచ్చి ఆమె భుజాన ఉన్న పెద్ద బ్యాగు అందుకున్నాడు. అమ్మయ్య వచ్చారో లేదోనని హడిలిపోయాను. బాబోయ్ ఏం జనం ఎన్ని ప్లేన్లు....ఏం ఏర్‌పోర్టు! అంతా ఒకసారే మాట్లాడేయాలన్నంత ఆరాటంగా అంది.

"అపుడే ఏం చేశావు? న్యూయార్క్ అంటే ఏమిటనుకున్నావు. ఆ జనం, ఆ కార్లు చూశావంటే బెంబేలెత్తిపోతావు. పద లగేజి తీసుకుందాం." అన్నాడు నవ్వుతూ. ఎయిర్ ఇండియా లగేజి కౌంటర్ దగ్గర కన్వేయర్ బెల్టు ద్వారా రకరకాల బ్యాగేజిలు గుట్టలుగుట్టలుగా వచ్చి పడ్తున్నాయి. తన సూట్‌కేస్‌లు రెండు చూపించింది వాసంతి. బిల్డింగ్ బయటికి వచ్చేసరికి నేల ఈనినట్లు కార్లు అరంగుళం ఖాళీ లేనట్లు పార్క్ చేసి ఉన్నాయి. ఈ ఊళ్ళో కారు పార్కింగ్ స్థలం దొరకడం బ్రహ్మాండం, కిలోమీటరు దూరంలో దొరికితే అదృష్టమే—అందుకే కారు కొన్నా లాభం లేదని కొనలేదు నేను టాక్సీకోసం వెయిట్ చేస్తూండగా అన్నాడు శ్రీరామ్.

టాక్సీలో వెడుతూంటే ఆ వెడల్పైన రోడ్లు, చీమలబారులా పాకిపోయే కార్లు. ఆకాశాన్నంటే బిల్డింగులు, ప్లైఓవర్లు. రకరకాల వ్యాపార ప్రకటనల బోర్డులూ, అంగుళం ఖాళీలేకుండా హడావిడిగా పరుగులు పెడుతున్న జనం... బాబోయ్ ఏం జనం, ఏం కార్లు, బొంబాయే అనుకుంటే ఈ న్యూయార్క్ ముందు బొంబాయి ఎందుకు పనికొస్తుంది. "పక్కనున్న భర్తని మరచి కుతూహలంగా, ఆశ్చర్యంగా రోడ్డువైపే చూస్తూన్న వాసంతిని చూసి "ఏమిటి మద్రాసులో పుట్టిపెరిగినా మరీ పల్లెటూరిదానిలా కార్లమొహం రోడ్లమొహం చూడనట్టు వింతగా చూస్తున్నావు" వేళాకోళం చేశాడు శ్రీరామ్. వాసంతి "సిగ్గుగా నవ్వింది. నాకింకా నమ్మకం కల్గడం లేదు. నేను అమెరికా వచ్చాననంటే....ఏమిటో. ఈ జనం, ఈ హడావిడి అంతా చూస్తే గాభరాగా ఉంది. మన ఇండియాలోనే అనుకుంటే ఇక్కడి జనం ఇంకా చీమలపుట్టల్లా ఉన్నారు. ఎటొచ్చీ మన రోడ్లమీదలాగ, బస్సు, రిక్షాలు, ఆవులు,

గేదెలు, లేకుండ, అన్‌రూల్ ట్రాఫిక్ కాకుండా అంతా సిస్టమేటిక్‌గా ఉంది అంది. "ఇక్కడ నించి మన ఫ్లాట్ ఎంత దూరం?" అంది. "ఓన్లీ ట్వంటీ టూ కిలో మీటర్స్" అన్నాడు శ్రీరామ్ నవ్వి. వాసంతి ఆశ్చర్యంగా నోరు తెరిచింది.

శ్రీరామ్ పెళ్ళికుదరగానే చేసిన మొదటి పని. ఓ టూ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనడం. న్యూయార్క్ లాంటి సిటీలో ఇళ్ళ అద్దెలు భరించాలంటే జీతంలో సగం ఖర్చరూపోతుంది. అమెరికాలో ప్రతిదీ ఇళ్ళు మొదలు ఫర్నిచర్, ఫ్రిజ్‌లు, టి.వి.లు కుకింగ్ రేంజ్‌లు, వాషింగ్ మెషిన్ల వరకు అన్ని ఇన్‌స్టాల్‌మెంట్స్ మీద కొనుక్కోవచ్చు. ఇంటికి సామాను అమరింది. జీతంలోంచి కటింగ్‌పోయి ఆ విధంగానైనా డబ్బు సేవ్ అవుతుంది అనుకుంటారు. శ్రీరామ్ ఆఫీసు నించి కొంత లోను, రెండేళ్ళలో తన సేవింగ్స్, కొంత అప్పు తీసుకుని టూ బెడ్ రూమ్ ఫ్లాట్ కొనేసి, వాసంతి వచ్చేసరికి కావలసిన మినిమమ్ ఫర్నిచర్—మంచాలు, బెడ్స్ ఫ్రిజ్ లాంటివి కొన్నాడు. వాసంతి తను వచ్చి డ్రాయింగ్ రూమ్ ఫర్నిచర్ అదీ కొంటా నని అల్టిమేటమ్ ఇవ్వడంతో మిగతాదంతా వాసంతికే వదిలేశాడు. శ్రీరామ్‌కి ఐదు వందల డాలర్లు వచ్చినా న్యూయార్క్‌సిటీలో భార్యాభర్తలున్నా దేనికి ఇబ్బంది లేకుండా గడపగలరు. కాని, లావిష్‌గా ఖర్చుపెట్టడానికి కుదరదు. ఇండియాకంటే ఫుడ్ చవక. డబ్బిచ్చినా మంచి వస్తువులు, కల్తీ లేనివి. తాజాహారలు, పళ్ళు దొరుకుతాయి. మోసానికీ, అన్యాయానికీ తావుండదు అక్కడ వర్తకులకు.

టాక్సీ వచ్చి పెద్ద అపార్ట్‌మెంట్స్ బిల్డింగ్ దగ్గిర ఆగింది. పార్కింగ్ ప్లేస్ దొరకదు కనుక చకచక సామాను దింపాడు టాక్సీనుంచి. శ్రీరామ్ కొన్న ఫ్లాట్ పదికొండో అంతస్తులో ఉంది. మొత్తం ఇరవైమూడు అంతస్తులున్న ఆ బిల్డింగ్ వంక తలెత్తి ఆశ్చర్యంగా చూసింది వాసంతి. మొత్తం రెండువందల ముప్పై ఫ్లాట్స్, చాలా ఆధునికంగా, పోష్‌గా ఉందా బిల్డింగ్, లాబీలు, లౌంజ్‌లు, రిసెప్షనిస్ట్ ఇంటర్‌కమ్స్ సెంటర్ టి.వి. ఏంటెనా, స్విమ్మింగ్ పూల్స్, ఆరు లిఫ్ట్‌ల ఆటో మేటిక్ లాకింగ్ డోర్సు- వాచ్‌మెన్, హౌస్‌కీపరు, కింద చిన్న షాపింగ్ సెంటర్, అన్నీ ఆధునికమైన పరికరాలతో ఎంతో నీట్‌గా ఉన్న ఆ ఫ్లాట్స్ చూడగానే ఎంతో నచ్చాయి వాసంతికి. ఫ్లాట్స్‌కి రెండు బెడ్‌రూమ్సు, విత్ ఎటాచ్డ్ బాత్‌రూమ్స్, ఒక లివింగ్ కమ్ డైనింగ్, ఒక కిచెన్, డ్రాయింగ్ రూమ్‌కిముందు చిన్న సిటవుట్ బాత్‌రూములన్నీ మోడర్న్ ఫిట్టింగ్స్, ఒక బాత్‌రూములో టబ్, హాట్, కోల్డ్ వాటర్ షవర్సు, బెడ్‌రూమ్సులో వార్డ్ రోబ్స్, మంచి ఫినిషింగ్‌తో చక్కటి కలర్ కాంబినేషన్స్‌తో గోడలకి రంగులు-నిగనిగలాడే ఫ్లోరింగ్, తలుపులు చూడగానే మురిసిపోయింది. ఈ ఇల్లు తనది. ఈ చిన్న ఇల్లు తనది అనుకోగానే అప్పుడే

ఏదో మమకారం వచ్చేసింది. ఉన్నంతలో భార్య రాక కోసం నీట్‌గా సర్దాడు శ్రీరామ్. ఇంక తను వచ్చింది. తన టేస్ట్ చూపొచ్చు. ఇల్లు సర్దడంలో. ఒక్కొక్కటి మంచిమంచివి అమర్చుకోవచ్చు. పెద్ద పెద్ద ఫ్రెంచి విండోస్ నించి కిందకి చూస్తే రోడ్లమీద చీమల బారుల్లా కార్లు, బొమ్మలు కదులుతున్నట్టు మనుషులు.... ఓహ్ ఎంతబాగుంది అంతే. పరవసించిపోయింది. తన అదృష్టానికి వానంతి.

* * *

త్రరువాత ఒక ఏడాది ఒక నిమషంలా గడిచిపోయింది వానంతికి. కొన్నాళ్లు ఇల్లు సర్దుకోడం, కొత్త ఫర్నిచర్ కొనడం, కొత్త కర్టెన్లు, కొత్త కార్పెట్లు, కొత్త కొత్త బెడ్ కవర్సు, వంటింట్లోకి డిష్‌వాషర్, వాషింగ్ మెషీను డ్రాయింగ్‌రూమ్‌లో చక్కటి ఫర్నిచర్. పెళ్ళికి వచ్చిన మంచి మంచి ప్రెజంట్స్ అన్నీ తీసుకు వచ్చి చక్కగా అలంకరించింది. తన ఇల్లు చూసుకొని పొంగిపోయింది వానంతి. శ్రీరామ్ భార్య ఏంచేసినా అడ్డు చెప్పకపోవటం అటుంచి, మెచ్చుకునేవాడు. ఏంచేసినా నీ ఇష్టం అనేవాడు. జీతం తెచ్చి వానంతినే అంతా మేనేజ్ చేసుకోమనిచ్చేసేవాడు. తను కోరుకున్న జీవితం, దేవుడులాంటి భర్త ఇంకేం కావాలి అనుకునేది. వీక్ ఎండ్స్‌కి శ్రీరామ్ కొత్త భార్యని తీసుకుని ఒక్కో ప్రదేశం చూపించేవాడు. కారు అద్దెకి తీసుకుని ఓసారి బోస్టన్‌లో మామయ్య ఇంటికి, చికాగోలో ఉన్న తన పెద్దతల్లి కూతురు ఇంటికి, వాషింగ్‌టన్‌లో ఉన్న ఇద్దరు తెలుగు ఫ్రెండ్సు ఇళ్ళకి-ఇలా ఏదో ఒక చోటికి వెళ్ళేవారు. న్యూయార్క్ సిటీలో అంతా తిప్పి చూపించాడు. సబ్‌వేస్, మెట్రో రైలుమార్గాలు పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ ఎక్కడికో అక్కడికి వెళ్ళేవారు వీక్ ఎండ్స్‌లో—రెండు మూడు వందల కిలోమీటర్లున్నా రెండు గంటల్లో సుఖంగా వెళ్లేంత మంచి రోడ్లు అమెరికావి. ఇటు నాలుగు అటునాలుగు వరసల్లో కార్లు గంటకి ఎనభై కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేసి సుఖంగా వెళ్ళేంత మంచి రోడ్లు, మంచి కార్లు, ప్రతి పదిహేను కిలోమీటర్లకి ఓ గ్యాస్ స్టేషను, ఒక కెఫ్టీరియా దారిపొడుగునా టూరిస్టులకి మాపులతో, సూచనలతో దారి చూపించే పెద్ద పెద్ద హోర్డింగ్స్. అక్కడ ప్రయాణం చాలా సుఖంగా, సులువుగా జరిగిపోతుంది. ఎంత తిరిగినా అలసట అనిపించేదికాదు. "ఇదే ఇండియా అయితే దుమ్ము, ధూళి, చెమట, గతుకులు, బురద....ఓ గాడ్ ఎంత తేడా" అనుకునేది.

అమెరికాలో లక్షలమంది భారతీయులున్నారు. న్యూయార్క్‌లోనే కొన్ని వేలమంది ఉన్నారు. తెలుగువాళ్ళవి వందల ఫ్యామిలీలున్నాయి. వానంతి వాళ్ళ బిల్డింగులోనే ఒక తెలుగు, ఒక సింధి, ఒక గుజరాతీ, ఒక బెంగాలీ కుటుంబా లున్నాయి. వారాంతంలో ఎవరో ఒకరు ఫ్రెండ్సు వచ్చేవారు. శ్రీరామ్ అక్క-

డున్న రెండేళ్ళలో చాలామంది తెలుగువాళ్ళు ఫ్రెండ్సు అయ్యారు. శ్రీరామ్ భార్యను చూడడానికని ఎవరో ఒకరు వచ్చేవారు. చాలామంది భారతీయులు, తెలుగువాళ్ళు వచ్చిపోతుండడంతో అసలు ఏదో విదేశంలో ఉన్నట్టే అనిపించేది కాదు వాసంతికి. ఏవన్నా పండగలు, పూజలు. వ్రతాలు, పుట్టినరోజులు - ఇలా ఎవరో ఒకరు పిలవడంతో, తరచు భారతీయులు అందరూ ఏదో ఒక విధంగా కలుసుకోవడంతో స్వదేశాన్ని మిస్ అవుతున్నట్టే అనిపించలేదు

కొత్త దేశం, కొత్త కాపురం, కొత్త భర్త కొత్త పరిచయాలు, కొత్త ప్రదేశాలు చూడడం మధ్య ఏదీ గుర్తుకానంత బిజీగా గడిచిపోయింది ఓ సంవత్సరం వాసంతికి....అమెరికాలో సుఖాలు, లగ్జరీస్ అన్ని పాతబడ్డాయి. ఏణ్ణర్ధానికి అమెరికా అంటే అదేదో భూతల స్వర్గంకాదని, అక్కడుండేది దేవతలు కారు మనుషులే సుమా అనిపించడానికి ఏణ్ణర్థం పట్టింది వాసంతికి. అమెరికాలో డబ్బున్నా కొన్ని విషయాలలో ఇండియానే నయం అనిపించింది కొన్నాళ్ళకి ముఖ్యంగా వాసంతికి వచ్చిన ఇబ్బంది అక్కడ పనికి మనుష్యులు దొరక్కపోవడం. ఉన్నా తమలాంటి వారికి అందుబాటులో ఉండకపోవడం. ఎప్పుడూ పని అలవాటులేని వాసంతికి అక్కడ అంట్లు తోముకోవడం, బట్టలు ఉతుక్కోడం, ఇస్త్రీ చేసుకో వడం, బాత్‌రూములు కడుక్కోవడం. గోడలు కిటికీలు దగ్గరనించీ, సబ్బునీళ్ళతో తుడవడం. కార్పెట్లు వ్యాక్యూమ్ క్లీనరుతో శుభ్రం చేసుకోవడం. బజారు పనులు, అన్ని ఒకత్తే చేసుకోవడం అంటే శ్రమ అనిపించడం మొదలుపెట్టింది. కొత్తలో కొత్త దేశం, కొత్త సంసారం, కొత్త ఇల్లు మోజులో తన ఇంటిని నీట్‌గా అందంగా తీర్చి దిద్దుకోవాలన్న తాపత్రయపడేది. రాను రాను పని అంటే ఏడుపు రావడం మొదలుపెట్టింది. పెళ్ళయేవరకూ ఇటు గ్లాసు అటు పెట్టే అవసరం లేక పోయింది. పని మనిషి, వంట మనిషి ఉండేవారు. పై పనులు తల్లి చూసుకుంటే వంటింటిపైపే వెళ్ళనవసరం లేకపోయేది. పెళ్ళి కుదిరాక వెళ్ళేది అమెరికా. అక్కడ పనికి ఎవరూ ఉండరు. నీకు అసలు బొత్తిగా వంటన్నారాదు నాల్గు రకాలు నేర్చుకో" అని తల్లి సాధిస్తే పెళ్ళయ్యాక అక్కడున్న ఆరు నెలల్లో కొన్ని ముఖ్య వంటలు, కూరలు అవి నేర్చుకుంది వాసంతి. అయినా రోజు దేన్లోనో దాన్లో ఉప్పెక్కువో, తక్కువో, కారం ఎక్కువో ఏదో అయ్యేది" నీ వంటకంటె నా వంటే నయ్యంలావుంది" అని నవ్వేవాడు శ్రీరామ్. శ్రీరామ్ బ్యాచిలర్‌గా ఇంకో స్నేహితుడితో కలిసిఉండేవాడు. న్యూయార్క్‌లాంటి సిటీలో రోజూ హోటలు భోజనం భరించడం అటుంచి, ఆ తిండి తినలేక నోరు చచ్చిపోయి ఇద్దరూ కలిసి వండుకుని తినడం ఆరంభించారు. తెలుగు స్నేహితుల భార్యల దగ్గర వంటలో ప్రాథమిక సూత్రాలు నేర్చుకుని వండుకుని తినడం ఆరంభించి ఏడాది గడిచేసరికి

వంటలో ఎక్స్‌పర్ట్స్ అయిపోయారు. నిజానికి వాసంతికి శ్రీరామ్‌కి వచ్చినన్ని వంటలు రావు. చాలావరకు శ్రీరామ్ నేర్పించాడు వంటలు. "ఇదే ఇండియాలో అయితే అడంగిపెధవ అనేవారు నన్నీ పాటికి. పెళ్ళాం కొంగు పట్టుకు ఏడుస్తున్నాడు వంటింట్లో అని తిట్టేవారు. ఇక్కడ అదొక సుగుణం, [ఆడమగ "తేడా లేకుండా అన్ని పనులు చేసుకొంటారు. ఈ దేశం రావాలంటే ముందు మగ వాడైనా సరే వంట నేర్చుకు రావాలి" అన్నాడు శ్రీరామ్. "ఏమిటో అంతా బాగుంది కాని ఈ అమెరికాలో పనివాళ్ళు లేకపోవడం ఏం బాగులేదు. ఇండియానే నయం—డబ్బు పారేస్తే దొరుకుతారు మనుషులు, ఈ చాకిరీతో చచ్చిపోతున్నాను" విసుక్కుంది ఓసారి వాసంతి.

"మరే ఏమిటనుకున్నావు అమెరికా అంటే-మన ఇండియాలో మాదిరి అంట్లకి పని మనిషి- బట్టలకి చాకలి, వంటకి వంటావిడ ఉన్నా మన ఆడవాళ్ళు ఏదో కష్టపడిపోతున్నట్టు అపసోపాలు పడతారు. శ్రమ పడడం అంటే ఏమిటో, డిగ్నిటీ ఆఫ్ లేబర్ వీరినిచూసి మనం నేర్చుకోవాలి - ఓసారి ఓ ఫ్రెండ్ ఇంట్లో పార్టీకి అమెరికన్స్ కొందరు వచ్చారు. మాటల్లో మా ఇండియాలో మేము ఇలా అన్ని పనులు చేసుకోనక్కరలేదు. మాకు గిన్నెలకి, తుడవడానికి పని మనిషి- బట్టలు ఇస్త్రీ చేయడానికి చాకలి, డబ్బున్న వాళ్ళకి వంటకి వంటమనిషి ఇంకా డబ్బుంటే కారు తుడవడానికో మనిషి తోటకి మాలి ఇలా ఉంటారు" అని గొప్పగా చెప్పింది ఆ గృహిణి. వింటున్న అమెరికన్లు ఆశ్చర్యపోయి "దెన్ వాట్ ఫర్ యూ పీపుల్ ఆర్ కమింగ్ హియర్?" అని ప్రశ్నిస్తే, మేమందరం నోరు మూసుకున్నాం జవాబు చెప్పలేక- ఈ దేశంలో ఉండే మంచి ఈ దేశంలో ఉంది. ఆ దేశంలో ఉండేది అక్కడుంది. ఏమైనా మన దేశం ఆడవాళ్ళు తమకేదో స్వాతంత్ర్యం లేదు. ఏదో కష్టపడిపోతున్నాం అంటారు కాని నిజం చెప్పాలంటే మన దేశం ఆడవాళ్ళే అదృష్టవంతులు" శ్రీరామ్ అన్నాడు.

శలవు రోజుల్లో శ్రీరామ్ కార్పెట్లు తుడవడం, గోడలు బ్రష్ చేయడం, వాషింగ్‌మెషిన్లు అవీ క్లీన్ చేయడం అన్నీ చేసి సహాయపడేవాడు. అయినా పని అంటే విసుగొచ్చేసింది వాసంతికి. ఇంట్లోవుంటే విసుగ్గావుందని కనిపెట్టి పోనీ నీవూ ఏదన్నా జాబ్ చేయి, మన ఇన్‌స్టాల్‌మెంట్స్ లోన్లూ తీరతాయి తొందరగా. నీకు కొంత బయటికి వెళ్ళివస్తే విసుగు తగ్గుతుంది" అన్నాడు ఓ రోజు.

ఇంటికి కావలసిన ఫర్నిచర్ లోన్స్‌కి శ్రీరామ్ జీతంలో చాలా కట్స్ పోతున్నాయి. అంతేకాక కొత్తమోజులో ఇద్దరూ తెగతిరికి ఖర్చు పెట్టడంతో డబ్బుకి నిజంగానే కటకటగా ఉంది శ్రీరామ్‌కి. వాసంతి ఉద్యోగంచేస్తే కొంత తెరిపిగా ఉంటుంది అనిపించింది అతనికి-అదే సలహా ఇచ్చారు. "ఆ చేస్తాను చేస్తాను,

ఏదన్నా చూడండి" అని ఉత్సాహపడింది. అప్పటినించి వాంటెడ్ కాలమ్స్ చూసి అప్లై చేయడం మొదలుపెట్టింది. రెండు నెలలకు ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌కి అకౌంట్స్ చూసే ఉద్యోగం వచ్చింది. వారానికి రెండువందల డాలర్లు జీతం. "అమ్మో అంటే నెలకి ఎనిమిదివేల రూపాయలన్న మాట" అంది గుండెలమీద చెయ్యి వేసుకుని సంబరంగా. "అదిగో, అమెరికాలో ఉండీ రూపాయల్లో లెక్క పెట్టక మానం మనం. ఇదే ఇండియన్స్‌తో గొడవ. రెండువందల డాలర్లంటే రెండువందల రూపాయలే అనుకోవాలి ఇక్కడ. ఇంతకీ, ఇంటి పనికే మొహం వేలాడదీస్తున్నావు. ఉద్యోగం చెయ్యగలవా" అనుమానంగా అన్నాడు.

"డబ్బు వస్తుంటే శ్రమ అనిపించదులెండి....ముందు ఈ లోన్లు తీరేవరకన్నా చెయ్యాలి. అదే అలవాటవుతుంది" అంది వాసంతి. వాసంతి జీతంతో ముందు అప్పులన్నీ తీర్చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పటివరకు పిల్లలను కనడం వాయిదా వేశారు.

* * *

వాసంతి అమెరికా వచ్చి రెండేళ్ళు గడిచాయి. వాసంతికి అటు ఉద్యోగం, ఇటు ఇంటి పనులు అన్నీ అలవాటై శ్రమ అనిపించడం మానేసి, మెకానికల్‌గా చేసుకుపోవడం నేర్చుకుంది. అమెరికా లగ్జరీస్ అన్నీ పాతబడిపోయాయి. అక్కడి వింతలు, విడ్డూరాలు, దేశాలు చూడ్డం అయిపోయింది.

అంత బిజీలైఫ్ మధ్య, ఆ సుఖాల మధ్య, భర్త ప్రేమానురాగాల మధ్య ఏదో తెలియని వెలితి ఫీలవ సాగింది వాసంతి. అదేమిటో కొన్నాళ్ళు అర్థం కాలేదు. గత ఆరు నెలల నుంచి మరీ ఏదో పోగొట్టుకున్నట్టు అనిపిస్తుంది. "ఏమిటలా మూడీగా ఉన్నావు? అమ్మా, నాన్న మీద బెంగా - మీ వాళ్ళని చూడాలని ఉందా" అనడిగాడు శ్రీరామ్ ఓ రోజు. నిజమే ఇన్నాళ్ళు కన్న తండ్రిని చూడకుండా ఎప్పుడూ లేదు. ఇండియా వెళ్ళాలంటే ఈ అప్పులన్నీ తీరి, ఇద్దరికి టిక్కెట్లకి డబ్బు పోగుచేసుకుని వెళ్ళాలంటే ఇంకో ఏడాది పడుతుంది. అప్పటి వరకూ పిల్లలను కనకుండా ప్లాను చేసుకుని ఇండియా వెళ్ళి రావాలనుకున్నారు చాలాసార్లు లెక్కలు కట్టి. తన వాళ్ళని చూడాలన్న బెంగతంటే కూడా ఏదో లోటుగా అన్పించ సాగింది వాసంతికి. తనకి అన్నీ ఉన్నాయి. ఇంత మంచి ఇల్లు, చక్కటి ఫర్నిచర్, మోడర్న్ గాడ్జెట్స్....అన్నీ ఉన్నాయి. తన సుఖం, తన సంసారం, తన గొప్ప ఇవన్నీ చూపేందుకు ఎవరున్నారు? చూసేందుకు తన వాళ్ళు ఇంతదూరం ఎవ రొస్తారు? ఇదే ఇండియాలో అయితే తన వాళ్ళకి, తన బంధువులు, స్నేహితులు వచ్చిపోతే ఎంత గర్వంగా ఉండేది. ఇక్కడెవరూ రాలేరనుకుంటే ఏదో వెలితి

అనిపించేది. స్వదేశానికి దూరంగా ఎంతో మంది ఇండియన్స్ ఉన్నారు. మధ్య మధ్య అందరూ కలిసి నప్పుడల్లా భారతదేశం గురించే మాట్లాడుకునే వారు. స్వదేశానికి దూరంగా ఉన్నామన్న భావం, ఆ వెలితి అందరూ వెలిబుచ్చారు. ఎన్ని ఉన్నా ఇవి మన దేశం గాదుగదా నిట్టూర్చేవారు. ఈ జీతం, ఈ సదుపాయాలు ఇండియాలో ఉంటే ఎంత ఆనందంగా ఉండేవాళ్ళం అనుకునేవారు. ఎప్పుడు నలుగురు కలిసినా మా ఊళ్ళో ఇలా, మా వాళ్ళిలా అని తమ ఊరి గురించి తప్ప అమెరికాలో వాళ్ళ లాభనష్టాల గురించి గాని, కష్టనిష్ఠూరాలు గాని మాట్లాడే వారు కాదు.

అమెరికాలో అమెరికన్స్ భారతీయులని ఎంత గౌరవించినా, భారతీయులతో అంత ఎక్కువ స్నేహంగా కలిసిపోరు. అమెరికన్స్ దాకా ఎందుకు, ఇండియాలో పక్కవాడు చస్తున్నా పట్టించుకోని వారు విదేశం రాగానే భారతీయుడన్న వాడు కనిపిస్తే ఏదో అప్తుడు కనిపించినట్టు అనిపిస్తుంది కాని భారతీయులు పదిమంది కలిసినా అందులో తెలుగువాళ్ళు తెలుగువాళ్ళతో, తమిళులు తమిళులతో ఎవరి భాషవారితో వారు కలిసిపోయినట్లు ఇంకోరితో అంత తొందరగా కలవరు. అంచేత చుట్టు పక్కల ఎంతో మంది అమెరికన్లు, ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు, రకరకాల దేశస్థులున్నా....దూరదూరంగా ఉన్న భారతీయులతోనే స్నేహం చేస్తారు. సిటీలో ఎక్కడెక్కడ తెలుగు వారున్నారో తెలుసుకుని మరీ వెళ్ళి స్నేహం చేసే వాళ్ళు అందరూ. పరిచయాలు స్నేహంగా మారాక నలుగురయిదుగురు ఫామిలీలు కలిసి పిక్నిక్‌లకి, పండగలకి తలో వస్తువు చేసి తీసుకెళ్ళి తినడం, పూజలు, వ్రతాలు అంటూ పిలవడం చేసుకునే వారు.

మద్రాసులో పుట్టి కాన్వెంట్ చదువులు చదివిన వాసంతికి తెలుగు రాయడం, చదవడం తల్లి బలవంతంగా నేర్పితే పట్టుపడ్డ రెండు ముక్కలు తప్ప రాదు. మాట్లాడుకోవడం కూడా స్కూల్లో, కాలేజీలో, ఫ్రెండ్స్‌తో, ఇంట్లో అన్నదమ్ములతో ఇంగ్లీషులోనే కావడంతో తెలుగు క్షుణ్ణంగా రాదు. నిజం చెప్పాలంటే వాసంతి అమెరికా వచ్చాకే తరచు తెలుగు వారిని కలుసుకుని తెలుగు ఎక్కువ మాట్లాడుతుంది. పూజలు, వ్రతాలు సిల్లీ అనే వాసంతి తెలుగువారు పిలిచే ప్రతి పూజకీ, వ్రతానికీ తప్పకుండా హాజరు అవుతుంది. ఉగాదులు, సంక్రాంతులు తెలుగు వారితో కలిసి తెలుగు పిండి వంటలు వండుతూ గడుపుతుంది. తనలో మార్పు తనకే ఆశ్చర్యంగా ఉండేది. ఒకసారి ఒకరింట్లో పార్టీలో ఆ మాటే అంది.

"మీరేకాదు. మేమూ అంతేనండి. మనదేశంలో ఉన్నన్ని రోజులు మన భాష, మన సంస్కృతి అంటే ఏ అభిప్రాయమూ ఉండేది కాదు. ఏమిటో ఇంత మంది దేముళ్ళు? ఏమిటీ పూజలు, వ్రతాలు అనిపించేది. ఇక్కడి కొచ్చాక గాని,

మనదేశానికి దూరం అయ్యాకగాని మన జాతి, భాష, మన మాతృదేశం పట్ల మమ కారం పొంగలేదు!" మిసెస్ చలపతిరావు నవ్వుతూ అంది.

"అంతేకాదు. ఇక్కడ అమెరికన్లకి మన దేవుళ్ళు, పురాణాలు, మనదేశం, మన పుణ్యస్థలాలు, చారిత్రక స్థలాల గురించి బాగా తెలుసు. వాళ్ళు ఏదన్నా తెలుసుకుంటే క్షుణ్ణంగా తెలుసుకోవాలనుకుంటారు. ఏదన్నా పార్టీలలో అక్కడ మమ్మల్ని ఏ రామాయణమో, ఏ భారతమో, ఏ కృష్ణుడి కథో, ఏ పండుగ గురించో, మన కట్టు, బొట్టు, మన నల్ల పూసలు, మల్లెలు ఇలా ప్రతి దాని విశిష్టత ఏమిటో, ఎందుకో చెప్పమనేవారు. వరలక్ష్మి వ్రతానికి అర్థం అడిగేవారు. కొన్ని వాళ్ళడిగే ప్రశ్నలకి మాకే జవాబులు తెలియక తడబడేవారం. "మీ దేశం గురించి మీకే తెలియదా? ఫలానిది మీరు చదవలేదా? పూజ చేస్తున్నారు అర్థం తెలియదా? ఏమిటీ మీకు తెలుగు చదవడం రాదా?" అంటూ ఆశ్చర్యపడితే మేం సిగ్గుపడి తలలు దించుకోవలసి వచ్చేది. మనదేశం గురించి, విదేశాల్లో సైతం ప్రఖ్యాతి గాంచిన మన పురాణాలు తెలుసుకోవాలన్న తపన, మన భాషలోని తీపి తెలుసుకొన్న కొద్దీ మా అందరికీ పంతం, పట్టుదలా వచ్చాయి. ఇంగ్లీషు వారికి, అమెరికా వారికి, ముస్లిమ్‌లకీ, బౌద్ధులకి ఎవరి మతం పట్ల, ఎవరి దేముడి మీద వాళ్ళకి అంత నమ్మకం, భక్తిశ్రద్ధలుంటే మన ఇండియన్స్‌మి, అందులో తెలుగు వాళ్ళం ఇలా ఎటూకాని వాళ్ళలా ఉండిపోవడం ఏమిటనిపించింది. వాళ్ళముందు మనం తేలిపోకూడదని తెలుగు వాళ్ళం అంతా కలిసి పండుగలు, పూజలు, వ్రతాలు అవి పట్టుదలగా చేయడం మొదలుపెట్టాం" మిసెస్ మల్లిక అంది.

"అంతేకాదు-అప్పటినుంచే మన సంగీతం, సాహిత్యం, మన నృత్యం విదేశీయులకి తెలుపాలన్న కోరికతో "ఆంధ్ర సాంస్కృతిక సంఘాలు, తమిళ సంఘాలు, కన్నడ సంఘాలు" అని ఏర్పడి, చందాలు పోగుచేసి రచయితలని, కవులని, సంగీత విద్వాంసులని, డాన్సర్లని ఆహ్వానిస్తూ ప్రదర్శనలు ఇప్పించి మన సంస్కృతి చెప్పాలన్న తాపత్రయం మొదలైంది." మిసెస్ శర్మ అంది.

"ఏమందోయ్, ఇదివరకు "శుక్లాం బరధరం" కూడా రాని వాళ్ళం, మా అందరికి ఇప్పుడు వేంకటేశ్వర సుప్రభాతం మొదలు, లలితా సహస్రనామాలు వరకు కంఠతా వచ్చేశాయి" మిసెస్ లలితారావు అందుకుంది.

"అంతేనేమిటి! మన దేశంలో ఇరవై ఏళ్ళు వచ్చినా వడుగు చేయకపోయినా ఇక్కడ ముద్దుగా పదేళ్ళకే వడుగులు చేస్తున్నాం. ఇండియాలో వరలక్ష్మి వ్రతం చేయకపోయినా ఇక్కడికి వచ్చాక మాత్రం క్రమం తప్పకుండా చేస్తున్నాం.

ఇక్కడ దేవాలయాలు చందాలు పోగుచేసి కొంత, తిరుపతి దేవస్థానం వారిచ్చిన దానితో కట్టించాం" డాక్టర్ రంగనాథం న్యూయార్క్ తెలుగు సమితి ప్రెసిడెంట్ అన్నారు.

"మనదేశం వెళ్ళినప్పుడు సత్యనారాయణ వ్రతం మొదలగు గణేశ పూజ, తద్దినం మంత్రాలు, ఉపనయనం తాలూకు అన్నీ రికార్డు చేసి క్యాసెట్లు తెచ్చుకొని అన్నీ శ్రద్ధగా పెట్టుకొని చేస్తున్నాం. అమెరికా వచ్చినా మన సంస్కృతిని ఎలా కాపాడుతున్నామో అందరికీ గర్వంగా చాటుతున్నాం" యూనివర్సిటీలో ప్రొఫెసర్ జగన్నాథం నవ్వుతూ చేర్చాడు.

"అంచేత మైడియర్ వాసంతి అమెరికా వచ్చాక మనం అసలు తెలుగు వాళ్ళంగా మారాం తెలుసా!" అంది శారదా సుబ్రహ్మణ్యం నవ్వుతూ.

వాసంతికి ఆ మాటల్లో ఎంతో నిజం కనిపించింది.

* * *

భారతదేశం వెళ్ళాలన్న కోరిక అమెరికా వచ్చిన మూడేళ్ళకి గాని తీరలేదు వాసంతికి. అప్పులన్నీ తీర్చి, ఇద్దరి టిక్కెట్లకి డబ్బు సమకూర్చుకున్నాక, మిగతా తన సంపాదనతో ఇంట్లో అందరికి, దగ్గర బంధువులకి, స్నేహితులకి పేరు పేరున ఏదో ఒక బహుమతి కొని రెండు సూట్‌కేసుల నిండా పేక్‌చేసి ప్లేను ఎక్కారు వాసంతి, శ్రీరామ్. మూడేళ్ళ తరువాత మాతృభూమిలో అడుగు పెట్టగానే గొంతు రుద్ధమై, ఆమెకు తెలియకుండానే కళ్ళు చెమ్మగిల్లాయి తనని రిసీవ్ చేసుకోడానికి ఢిల్లీ వచ్చిన తండ్రిని కౌగిలించుకుని గుండెలో మొహం దాచుకుంది. "యూ సిల్లీ, ఏమిటా కన్నీరు." శ్రీరామ్ మందలించాడు.

* * *

ఇండియాలో నెలా పదిహేను రోజులు కరువుదీరా "హాలిడే" గడిపింది. ఏ పని లేకుండా హాయిగా తిని, చూడాలనుకున్న బంధువులందరి ఇళ్ళకి వెళ్ళి రెండేసి రోజులుండి కొన్ని బహుమతులు ఇచ్చి, వారిచ్చిన చీర, పసుపు కుంకుమలు పుచ్చుకుని, స్నేహితులతో మనసారా ఎంజాయ్ చేసి, తల్లి దగ్గర కరువుదీరా రెస్టు తీసుకుని చూడాలనుకున్న తెలుగు సినిమాలు చూసి, మళ్ళీ మూడేళ్ళవరకు రాను గదా అనుకుని బరువైన హృదయంతో భర్తతో విమాన మెక్కింది వాసంతి.

* * *

ఇండియా నుంచి వచ్చాక ఒక వారం పదిరోజులు అన్యమనస్కంగా, మూడీగా అదోలా దిగులుగాఉన్న వాసంతినిచూసి ఓదార్పుగా "నీవు ఇండియాని, మీ

వాళ్ళని బాగా మిస్సవుతున్నట్లున్నావు గదూ. పోనీ మనం ఇండియా వెళ్ళిపోదామా అక్కడ ఇద్దరు ముగ్గురు నా ఫ్రెండ్స్ మంచి కంపెనీలలో ఆఫర్లు ఉన్నాయి వస్తావా, నాలుగయిదు వేలు జీతం ఉంటుంది అన్నారు. నీవు బాగా ఆలోచించి చెప్పు. వెళ్ళిపోదాం అంటే వాళ్ళకి ఏదో ఒక జాబ్ ఫిక్స్ చేయమని రాస్తాను. వెధవ డబ్బుకేం ఉంది. నీవు సంతోషంగా ఉండడం కావాలి నాకు" అన్నాడు లాలనగా.

వానంతి ఒక్క క్షణం అయోమయంగా అర్థంకానట్లు చూసింది. తరువాత వద్దన్నట్టు గబగబా తలాడించింది. శ్రీరామ్ ఆశ్చర్యంగా చూశాడు. "అదేం? ఇంకా అమెరికా మోజు తీరలేదా? నీవు బెంగ పెట్టుకున్నావని అన్నాను" అన్నాడు.

వానంతి జవాబుకి మాటలు తడుముకుంది. ఏలా చెప్పాలో అర్థంకానట్టు తడబడింది. "వద్దు, వద్దు, మనం ఇండియా వెళ్ళొద్దు. నేను ఇండియాని, మన వాళ్ళని మిస్ అవుతున్నమాట నిజమే. కాని ఏమిటో ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు. చూడండి. ఇండియాలో ఉన్నన్ని రోజులు ఈ డర్టీ కంట్రీ, దుమ్ము ధూళి, మురికి, ఆకలి, దరిద్రం, రోగాలు, అవినీతి, అరాచకం అనుకుంటూ వెధవ దేశం అనుకుని తిట్టుకొనేదాన్ని. అక్కడ పెళ్ళి కాకముందు అమ్మని ప్రతి దానికి కాల్చుకు తిన్నాను. ఇది కావాలి, అది కాదు అంటూ అలుగుతూ వేధించుకు తిన్నాను. ఇక్కడికొచ్చాక అమ్మకి దూరమయ్యాక గాని "అమ్మ" అంటే ఏమిటో తెలిసిరాలేదు. అలాగే మాతృదేశానికి దూరమయ్యాకగాని "జన్మభూమి" గొప్పతనం తెలిసిరాలేదు. మన జాతి, మన భాష, మన సంస్కృతిపట్ల అభిమానం, గౌరవం ఇక్కడికొచ్చాక పెరిగింది. ఇదే మనదేశం మళ్ళీ వెళ్ళాం అనుకోండి - ఈ నెలా పదిహేను రోజులలో చూశానుగా-ఆ నీళ్ళ ఇబ్బంది, ఆ సానిటరీ సిస్టమ్స్, ఆ బీదరికం, ఆ అశుభ్రత, ఆ దుమ్ము, ధూళి, చెమట, కుట్రలు, మోసాలు, చాలీ చాలని జీతాలు, ఇవన్నీ తిట్టుకుంటూ వెధవ దేశంలో ఉన్నాం అని బాధపడుతూ, విదేశాల్లో ఉంటే అని ఇతర దేశాలని పొగుడుతాం. అదే ఇక్కడుంటే స్వదేశాభిమానం పెరుగుతుంది. మన మనసుల్లో మాతృభూమిపట్ల గౌరవం ఉండాలంటే, మనదేశం విలువ తెలిసిరావాలంటే దూరంగానే ఉండాలి. జననీ, జన్మభూమీ అన్నదే మధురమైన భావన! ఆ భావన మన మనసులో నిలవాలంటే జన్మభూమికి దూరంగా ఉన్నప్పుడే సాధ్యం. ఇండియాలోఉండి ఇతర దేశాలని పొగుడుకుంటూ మన దేశాన్ని తిట్టుకునే కంటే అమెరికాలోఉండి భారతదేశాన్ని పొగుడుకోవడమే నయం. కాదంటారా?" ఎంతో ఎమోషనల్‌గా అంటున్న వానంతిని ఆశ్చర్యంగా ప్రశంసాపూర్వకంగా చూశాడు శ్రీరామ్.

(ఆంధ్రప్రభ వార పత్రిక "1986")

★